www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 19 మే 2024

నియోజకవర్గం	2019%	2024%
నగరి	86.59	87.08
చిత్తూరు	78.16	81.24
జీడీ నెల్లూరు	86.39	88.69
పూతలపట్టు	86.44	87.66
పలమనేరు	66.31	87.90
పుంగనూరు	85.29	86.62
కుప్పం	85.08	89.88

నిశ్శబ్ద యుద్ధం

తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిశ్శబ్ద యుద్ధమే జరిగిందని చెప్పాలి. అంతుచిక్కని ఓటరు నాడితో అభ్యర్థులు సైతం ఆందోళన చెందుతున్నారు. మేధావులకు కూడా అర్థం కాని విధంగా ఓటరు మౌనంగా సమాధానం చెప్పినట్లే తెలుస్తోంది. ఉదయం నుంచి రాత్రి 11గంటల వరకూ కూడా అదే ఉత్సాహంతో ఓటర్లు క్యూ లైన్లో బారులు తీరి మరీ ఓటు వినియోగించుకొన్నారు. భారీ స్థాయిలో ఓటు శాతం నమోదవడం విశేషం. యువ ఓటర్లు రెట్టింపు ఉత్సాహంతో ఓటెత్తారు. ఈ పరిణామం దేనికి సంకేతం అన్నదే జవాబు రాని ప్రశ్నగా మారింది. స్తబ్ధుగా ఓటు వేసి అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించారు ఓటర్లు.

- ప్రజాశక్తి-వెదురుకుప్పం

- మౌనమే ఓటరు సమాధానమా!?
- భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- నూతన ఉత్సాహంతో కొత్త ఓటర్లు
- ఎమ్మెల్యే అభ్యర్థులలో ఆందోళన
- మేధావులకు కూడా అర్థం కాని ఓటరు నాడి

ఏపీలో ఎన్నికల సంగ్రామం ముగిసింది. భారీ ఎత్తున ఓటర్లు ఓటు వినియోగించుకొన్నారు. గతం కంటే ఓటింగ్ శాతం పెరిగింది. మరీ ముఖ్యంగా యువ ఓటర్లు ఉత్సాహంగా ఓటెత్తారు. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. 15,63,911మంది ఓటర్లు ఉండగా అందులో 13,62,008మంది ఓటు వినియోగించుకున్నారు. జిల్లాలో అత్యధికంగా కుప్పం నియోజకవర్గంలో 89.88శాతం మంది, అత్యల్పంగా చిత్తూరు నియోజకవర్గంలో 81.24శాతం మంది ఓటు వేశారు. జిల్లాలో గత 2019లో 85.02 పోలింగ్ శాతం నమోదు కాగా ఈ దఫా 2.07శాతం పెరిగి 87.09శాతంగా నమోదైంది.

2లక్షల మంది ఓటుకు దుమ్మా..

చిత్తూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో సుమారు 2లక్షల మంది ఓటర్లు దుమ్మా కొట్టినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అందు లోనూ 1,06,163మంది మహిళలు ఓటు విని యోగించుకోలేకపోయారు. 95,700 మంది పురుషులు ఓటు వేయలేకపోయారు. జిల్లా మొత్తంగా 2,01,903మంది ఓటు వేయలేదు. అత్యధికంగా చిత్తూరు నియోజకవర్గంలో 38,062మంది దుమ్మా కొట్టారు.

ఇంతకీ మౌనంగా ఎందుకలా..

మునుపెన్నడూ లేని విధంగా ఈ దఫా ఎన్నికల్లో ఓటరు నాడి పట్టుకోవడంలో అభ్యర్థులు, సర్వే సంస్థలు, నేతలు విఫలమయ్యారనే తెలుస్తోంది. పూర్తిగా స్తబ్ధుగానే అధిక శాతం మంది ఓటు వేసి అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఎందుకలా మౌనంగా అనే ప్రశ్నకు భిన్నమైన సమాధాలు వినిపిస్తున్నాయి. అత్యధికంగా ఓటుకు రూ.1500 నుంచి రూ.5వేల వరకూ పంపిణీ జరిగింది. ప్రధాన వైసీపీ, టీడీపీలు పోటాపోటీగా నగదును ఓటర్లకు చేర్చారు. ఈ క్రమంలో ఇరు పార్టీలు ఇచ్చిన సొమ్మును వద్దనకుండా తీసుకుని నచ్చినోళ్లకు ఓటేసినట్లు బాహాటంగా చెబుతున్నా.. పలానా పార్టీకి ఓటు వేసినట్లు బయటకు చెబితే సొమ్ము ఇచ్చిన పార్టీల నుంచి ఇబ్బంది వస్తుందేమోననే కారణం కూడా అయ్యుండొచ్చనే వాదనలూ లేకపోలేదు.

వలంటీర్ల ప్రమేయమెంత..

ఎన్నికల కమిషన్ వలంటీర్లను పూర్తిగా ఎన్నికల విధుల నుంచి పక్కన పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇన్నాళ్లూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటి చేర్చిన వలంటీర్లను ఓటింగ్ కోసం పరోక్షంగా వాడుకోవడానికి వారి చేత నేతలు ప్రోత్సలంతో రాజీనామాలు చేయించారు. పార్టీ కోసం, డబ్బు పంపిణీ కోసం కొన్ని చోట్ల వారిని వాడుకున్నట్లు తెలుస్తోంది. ఇంతకీ వారి ప్రమేయంతో ఓటర్లు ముందుకొచ్చారా.. అంటే అలాంటి పోల్‌మేనేజ్‌మెంట్‌కి ఓటరు అవకాశం ఇవ్వలేదు. స్తబ్ధుగానే ఓటేశారని బలంగా వినిపిస్తోంది.

చైతన్యం రగిలిందా..

ఓటరులో చైతన్యం రగిలిందా.. అంటే ఓననే సమాధానానికి బలం చేకూరుతోంది. ఆయా ప్రధాన రాజకీయ పార్టీ నేతలు వ్యవహారశైలి, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, శాంతి, భద్రతలు, సామాజిక న్యాయం, కుటుంబ రాజకీయాలు, మాయమాటలు తదితర అంశాలను ఓటర్లు నిశితంగా పరిశీలించారు. ఎన్నికల ముందు నేతల కులాల సమావేశాలు, విద్వేషాలు, కవ్వింపు చర్యలకు ఎక్కడా కూడా ఓటరు ఆకర్షితులైనట్లు కనిపించడం లేదు. గతంకంటే భిన్నంగా పూర్తి ఆలోచనతో మౌనంగా సామాధానం చెప్పినట్లు తెలుస్తోంది.

సర్వేల్లో నిజమెంత..

ఎన్నికలకు ముందు, ఎన్నికలు ముగిసాక కొన్ని సర్వే సంస్థలు ఫలితాలు ఎవరికి అనుకూలమో వెల్లడించాయి. ఇంతకీ ఆ ఫలితాల్లో నిజమెంత. ముందుగా సేకరించిన శాంపుల్స్‌లో అత్యధిక శాతం ఎవరి పేరు చెబితే వారికే ఓటరు అనుకూలమంటు సర్వేసంస్థలు బహిర్గతం చేశాయి. గ్రామ స్థాయి నుంచి భిన్నమైన సమాధానాలు వినిపిస్తున్నాయి. ఆయా పార్టీ నుంచి సొమ్ము తీసుకున్న ఒకింట్లో 5ఓట్లు ఉంటే వారు 3ఓట్లు, ఇంకో పార్టీ 2 చొప్పున ఓట్లు వేశారని టాక్. ఇలా చాలా గ్రామాల్లో జరిగినట్లు తెలిసింది.

కార్యకర్తల్లోనూ నైరాశ్యం..

అధికారంలో ఉన్నా తమకెలాంటి లాభం చేకూరలేదని వైసీపీ కార్యకర్తలు బాహాటంగానే చెబుతున్నారు. పైగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్ వంటి ఇబ్బందులతో కాస్త నైరాశ్యం కనిపించింది.

ఐదేళ్ల పాటూ ప్రతిపక్ష పాత్రలో కనీస ఖర్చులకు కూడా లేకుండా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నేతల నుంచి సాకారం అందక స్థానికంగా ఇబ్బందులు పడ్డామని ప్రతిపక్ష పార్టీ నేతల నుంచి వినిపిస్తున్న మాట. ఇక పోలింగ్ రోజున వారి పాత్ర అంతంత మాత్రంగానే కనిపించింది.

కేడర్‌కే అంతుపట్టని విధంగా..

ఆయా పార్టీలకు పట్టుకొమ్మలు కార్యకర్తలే. సాధారణంగా ఓటరు నాడి పట్టగలిగే ఏకైన నెట్‌వర్క్ పార్టీ కేడర్ మాత్రమే. గ్రామ, వార్డు స్థాయి నుంచి ప్రతి ఇంట్లో ఏ ఓటు ఎవరికనే అంచనా వేయగల సామర్థ్యం వారికే ఉంది. ఈ దఫా ఓటరు మాత్రం నిశ్శబ్దంగానే సమాధానం చెప్పారు. ఆయా పార్టీ కేడర్ నుంచి కూడా సరైనా అంచనా బయటపడట్లేదు.

అభ్యర్థుల గుండెల్లో దడ

పోలింగ్ ముగిసే సమయానికి ఊహించని స్థాయిలో అత్యధిక శాతం ఓటెత్తారు. ఉదయం 7గంటల నుంచి రాత్రి 11గంటల వరకూ ఓటర్లలో జోష్ కనిపించింది. ఎక్కువ శాతం మంది ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏ ఓటు ఎటు పడిందో క్యాడర్ కన్ఫూజన్ కాస్త నాయకుల ఆందోళనకు దారి తీసింది. పైగా యువ ఓటర్ల నాడి అస్సలు చిక్కలేదట. గెలుపోటములు డిసైడ్ చేసే ఆ యువత ఎటువైపు మొగ్గుచూపారో.. ఫలితం ఎలా రాబోతోందోనని నేతల్లో దడ మొదలైంది. పైకి తమ గెలుపుపై ధీమాగా ఉన్నా లోలోన ఆందోళనలో ఉన్నారని నేతల సన్నిహితుల నుంచి సమాచారం.

అర్ధరాత్రి వరకూ ఓటెత్తారేంటబ్బా..

గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరిగి, అర్బన్ ప్రాంతాల్లో తగ్గేది. అలాంటిది అన్ని చోట్లా ఓటర్లు క్యూ కట్టిమరీ ఓట్లు వేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అదే ఉత్సాహం కనిపించింది. అధికార వైసీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఆకర్షితులైయ్యారా.. లేక ఎన్‌డీఏ కూటమి ప్రకటించిన పథకాలు, నేతల కలయికపై ఆ పార్టీ వైపు మొగ్గారా.. అనే జవాబురాని ప్రశ్నలు కోకొల్లలు.

భవితవ్యం బాక్సుల్లో భద్రంగా..

ఓటర్లు ఓటు కోసం పోటెత్తారు. ఆ ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఆయా పార్టీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నా.. వారి భవితవ్యం మాత్రం ఈవీఎం బాక్కుల్లో భద్రంగా ఉంది. ఓటరు తీర్పు ఎవరికి అనూకూలమో జూన్ 4 వరకూ వేచి ఉండాల్సిందే.

ఇట్టయితే ఎట్టుంటాది..!!

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: మావా.. రా మావా.. నీ కోసమే ఎదురు సూస్తా ఉండాను. ఎలచ్చన్లో నువ్వు జెప్పింది నేను ఇన్నా.. ఈ యాళ నేను జెప్పింది నువ్వు ఇనాల అంతే. యాం లేదు మావా.. జగనన్న సీఎం అయ్యి, కాళాస్త్రిలో మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే అయితే ఓకే.. అట్టగాకుండా సెంద్రబాబు సీఎం అయ్యి, సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే అయితే ఓకే.. అదీగాకుండా ఏరే ఇదంగా అయితే...? అదే మావా జగనన్న సీఎం అయ్యి ఇక్కడ సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే అయితే, ఇంకాగాకుండా అక్కడ సెంద్రబాబు సీఎం అయ్యి ఇక్కడ మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే అయితే ఎట్టుంటాది అనేది నా బుర్రలో ఆలోశన. ఎండకి తిరిగితే బుర్ర గిర్రని తిరగతా ఉంద్ల. ఆ మాదిర్తో రాతిరి నుంచి ఇదే తిరగతా ఉండాది. సీకటితోనే ఇంటి కాడికి ఒచ్చినా. మీ మావ వాకింగ్‌కి పొయ్యినాడని మాయత్త జెప్పింది. సరే యాడికి బొయ్యినా సద్దికూడు తాగేసి ఒస్తావని సావిట్లో కూసోనుండా. నేను జెప్పింది అయ్యేదానికి శాన్సు ఉండాదా.. లేదా.. కరెట్టా.. కాదా.. సెప్పు మావా. ఉండాదంటావు, లేదంటావు, జరగతాదంటావు, జరగదంటావు యాంది మావా. వాకింగ్‌కి పోతే పిచ్చికుక్కేమన్నా కరిసిందా... లేకపోతే ఎండకి తలకాయ తిరగతా ఉండాదా.. మాయత్త యామన్న అనిందా. అవును నిజమే మావా.. నువ్వు జెప్పింది గూడ ఆలోసించాల. చేసినోడిని ఒదిలేసి... చూసినోడిని ఒదిలేసి... చెప్పినోడిని ఒదిలేసి.. ఊ కొట్టినోడిని ఒదిలేసి.. ఈ మెసేజి సదివినోళ్ళ పైన కచ్చ పెంచుకుంటారు. మనోళ్లు సెప్పుడు మాట్లు బాగ ఇంటారు. రిజల్సు ఎట్టుండినా నేను జెప్పింది కరెట్ అని జెప్పినావు నాకు శానా ఇదిగా ఉండాది మావా ఇట్టయితే ఎట్టుంటాది.. ఇట్టయితే ఎట్టుంటాది..!!

బోర్డు ఒకచోట..

కౌంటర్ మరోచోట..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అధికారులు చెప్పేదానికి చేసేదానికి ఎటువంటి పొంతన ఉండదు. పారదర్శకంగా ఉన్నట్లు పైకి చెబుతున్నా లోపల మాత్రం మరేదో దాగి ఉంటుంది. అందుకు రూ.200ల ప్రత్యేక దర్శనం కౌంటరే ఉదాహరణ. ఓంకార స్వామి మఠం వద్ద పిఆర్‌ఓ కార్యాలయాన్ని, రూ.200ల ప్రత్యేక దర్శనం కౌంటర్ను దేవస్థానం అధికారులు ఇటీవల ఏర్పాటు చేశారు. అయితే పిఆర్‌ఓ కార్యాలయాన్ని అక్కడే ఉంచి రూ.200ల టికెట్ కౌంటర్‌ను మాత్రం ధూర్జటి గ్రంథాలయం వద్దకు మార్పు చేశారు. పిఆర్‌ఓ కార్యాలయానికి వచ్చిన భక్తులు అక్కడే 200 రూపాయల టికెట్ కొనుగోలు చేసి ప్రత్యేక దర్శనానికి వెళ్లేవారు. ప్రముఖులైతే పిఆర్‌ఓ కార్యాలయ సిబ్బంది కూడా వెళ్లేవారు. టికెట్ కౌంటర్‌ను ఎత్తివేయడంతో పిఆర్‌ఓ కార్యాలయం సిబ్బంది మాత్రమే భక్తులతో వెళు తున్నారు. టికెట్లు మాత్రం కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆలయానికి ఆదాయం రావడం లేదు. ఈ ఆదాయం కొందరు దళారుల జేబుల్లోకి వెళుతోంది. టికెట్ కౌంటర్ కూడా పిఆర్‌ఓ కార్యాలయంలోనే ఉంటే భక్తులు అక్కడే టికెట్ కొనుగోలు చేసి దర్శనానికి వెళ్లేవారు. దళారుల సంక్షేమం కోసం దేవస్థానం అధికారులు ఈ గొప్ప నిర్ణయం తీసుకున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి.

పనులు వేగవంతం చేయండి : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను కమిషనర్ అదితి సింగ్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా కాంట్రాక్టర్లకు, ఏఈకామ్ ప్రతినిధులకు, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ సమన్వయంతో పనులు వేగవంతం చేసి భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ భవనం పూర్తి అయితే మునిసిపల్ కార్పొరేషన్‌కి నూతన కార్యలయం రావడమే కాకుండా, కమాండ్ కంట్రోల్ సేవలు కూడా ప్రజలకి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులు ఆలస్యంపై స్పందిస్తూ ఇకపై ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల వివరాలను తనకు తెలియజేస్తూ పూర్తి స్థాయిలో నివేదిక ఇస్తూ వుండాలని ఆదేశించారు. స్లాబ్ వర్కులన్ని పూర్తి చేసి, ఏ ఫ్లోర్‌కి ఆ ఫ్లోర్లలో చేపట్టాల్సిన పనులను పూర్తి చేసుకుంటూ రావాలన్నారు. ఇకపై పనులు ఆలస్యమయితే తగుచర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రక్టర్లు, డిఈ విజయ కుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

- వరి, టమోట, మామిడి పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-సదుం: మండల పరిధిలోని జోగివారిపల్లి పంచాయతీ పరిధిలోని బత్తలవారిపల్లి, జోగివారిపల్లి గ్రామాల రైతుల పంట పొలాలపై గత శుక్రవారం రాత్రి ఏనుగులు గుంపు పడి పంటలకు తీవ్ర నష్టం కలిగించిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా వున్నాయి.. బత్తలవారిపల్లి, జోగివారిపల్లి గ్రామాలకు చెందిన రైతులు నరసింహా రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, జ్యోతి, సురేష్ రెడ్డి రఘు అనే రైతులు వేసుకొన్న వరి, టమోటా, మామిడి, జొన్న తదితర పంటలపై ఏనుగులు గుంపు పడి తీవ్ర నష్టం కలిగించినట్లు రైతులు విలేకరులకు తెలిపారు. అంతే కాకుండా పంట పొలాలకు రక్షణగా ఏర్పాటు చేసుకొన్న రాతి కూసాల పెంచింగ్‌ను విరగగొట్టి, తోటలోకి ప్రవేశించి, పంటలను తొక్కి నాశనం చేశాయని రైతులు వాపోయారు. పంటలకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులను పెరికేసి, ధ్వంసం చేశాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక నైనా అటవీ శాఖా అధికారులు తగు చర్యలు తీసుకొని ఏనుగుల గుంపును పంట పొలాలు వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంలో అరాచకాలు

- విశ్వవిద్యాలయంలో విధ్వంసం
- బూర్జవ రాజకీయ కుట్రలకు తిరుపతి వేదిక

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి అంటే ప్రపంచ వ్యాప్తంగా పరిచయం లేని ఊరు. ఆధ్యాత్మిక, విద్యా కేంద్రంగా విరాజిల్లుతుంది. ఇలాంటి ప్రసిద్ధిగాంచిన నగరాన్ని బూర్జవ రాజకీయ పార్టీలు తమ కుట్రలకు వేదికగా చేసుకోంటోంది. ఆధ్యాత్మిక కేంద్రంలో అరాచకాలకు తెరలేపారు. ప్రపంచంలోనే ఎక్కడాలేని విధంగా 8 విశ్వవిద్యాలయాలతో వెలుగుతున్న తిరుపతిలో రాజకీయ విధ్వంసానికి పూనుకోవడం శోచనీయం. రాజకీయాల్లో గెలుపు ఓటములు సర్వసాధారణం. కానీ కక్షలు, కుట్రలు సరైనవి కావు. గత వారం రోజులుగా తిరుపతి వాసులు భయాందోళనతో కాలం గడుపుతుండడం గమనార్హం.

శ్రీవెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న జిల్లా తిరుపతి. ఇక్కడికి ప్రతిరోజు దేశవిదేశాల నుంచి లక్షమందికిపైగా యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే మరో 20 నుంచి 30 వేల మంది అదనంగా వస్తుంటారు. ప్రస్తుతం వేసవి సెలవు నడుస్తున్నాయి. మే 13న రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో విహార యాత్రలు తగ్గాయి. పోలింగ్ తర్వాత తిరుపతి సందర్శనకు యాత్రికుల తాకిడి పెరుగుతుందని అందరు భావించారు. కానీ పోలింగ్ రోజు రాత్రి నుంచి జిల్లాలో జరిగిన విధ్వంసాలతో యాత్రికుల మాట అటుంచితే జిల్లా వాసులే భయాందోళనలో ఉన్నారు. పోలింగ్ రోజు ఒక పార్టీ ఏజెంట్ ప్రత్యార్థి పార్టీ నాయకులు కొట్టడం, నాయకులపై, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగడంతో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండు రెచ్చగొట్టే ధోరణికి దిగాయి. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రారంభమైన గొడవ చిలికిచిలికి గాలివానగా మారి. విశ్వవిద్యాలయాల్లో విధ్వంసం సృష్టించే స్థాయికి చేరింది. పోలింగ్ రోజు సోమవారం జిల్లాలో అర్ధరాత్రి వరకు కొన్నిచోట్ల పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పలు కేంద్రాలను పరిశీలించారు. రామిరెడ్డిగారిపల్లి వద్ద వైఎస్‌పి ఏజెంట్‌పై టిడిపి కూటమి నాయకులు దాడికి పాల్పడడంతో గొడవ ప్రారంభమైంది. ఇరుపార్టీల నాయకుల రెచ్చగొట్టే దోరణితో వ్యవహరించారు. అదే రోజు సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత వైసిపి సర్పంచి చంద్రశేఖర్‌పై కూటమి నాయకులు దాడి చేశారు. అతని ఇంటిపై రాళ్లతో, కర్రలు, రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న వైసిపి అభ్యర్థి గాయపడిన వారిని పరామర్శించేందుకు వస్తుంటే టిడిపి కూటమి నాయకులు నడిరోడ్డుపై అతన్ని అడ్డగించి దాడికి పాల్పడ్డాడు. టిడిపి అభ్యర్థి కళ్లముందే వైసిపి అభ్యర్థి కారును దగ్ధం చేశారు. మరో కారును ధ్వంసం చేశారు. అతనిపై దాడికి పాల్పడితే నలుగురు గన్‌మేన్ల భద్రతతో అక్కడ నుంచి తప్పించుకున్నారు. దీంతో అధికార పక్షం కక్ష పెంచుకున్నట్లు ఉంది. పోలింగ్ మరుసటిరోజు మంగళవారం ఈవిఎంలన్ని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచే సమయంలో పోటీలోని అభ్యర్థులు రావడం సహజం. ఈ నేపథ్యంలో మహిళా వర్శిటీకి టిడిపి అభ్యర్థి తన అనుచరులతో చేరుకున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న అధికార పార్టీ నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఉన్నట్టుండి అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు గొడవలకు దిగారు. టిడిపి అభ్యర్థి కారుపై వైసిపి నాయకులు దాడి చేశారు. కారును ధ్వంసం చేశారు. అభ్యర్థిపై దాడికి ప్రయత్నిస్తే అతను గన్‌మెన్ అడ్డుకోవడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అంతటితో గొడవ అగలేదు. ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని బీరుబాటిళ్లు, రాడ్లు, కత్తులు, కర్రలు, సుత్తులతో కొట్టుకుంటూ బీభత్సం సృష్టించారు. భద్రత కేంద్రమైన స్ట్రాంగ్ వద్దే ఇంత జరుగుతున్న పోలీసులు నిమ్మకుండడం గమనార్హం. వర్శిటీ నుంచి ఒకరిపై మరోక్కొరు దాడులు చేసుకుంటూ పరుగులు తీశారు. దీంతో మహిళా వర్శిటీ సమీప ప్రాంతాల్లో సైతం ప్రజలు, షాపులు మూసివేసి, ఇళ్లకు తలుపులువేసి దాంకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అంతా జరిగాక తీరిగ్గా పోలీసులు తమ బలగాలతో వర్శిటికి చేరుకున్నారు. రావడమే తమ ప్రతాపాన్ని చూపించారు. వర్శిటీ ప్రాంగాణంలో ఉన్న సిబ్బంది, స్థానికులు, ఆఖరికి మీడియాపై లాఠీలు ఝులిపించారు. సాయంత్రానికి కలెక్టర్, ఎస్‌పి అక్కడికి చేరుకుని పరిస్థితులను సమీక్షించి, జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ ప్రకటించారు. ఘటనపై విచారణ చేపడుతాం. కారుకులను శిక్షిస్తామంటూ పేర్కొన్నారు. బూర్జవ పార్టీలకు చెందిన నాయకులు మాత్రం తమ గాయాలకు చికిత్స తీసుకున్నారు. కానీ ఇరుపక్కాల దెబ్బలతిన్న కార్యకర్తలు, అభిమానులు ఇళ్లకు వెళ్లి ఎవ్వరికి చెప్పుకోలేక బాధలను అనుభవించారు. స్థానికులు, ఉద్యోగులు, తమపై జరిగిన దాడికి ఇరుపార్టీల వారిని తిట్టుకోవడం తప్పా ఏమిచేయలేక పోయారు. జర్నలిస్టుల మాత్రం వారిపై జరిగిన దాడిని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం శూన్యం. మునుపెన్నడు లేని విధంగా విశ్వవిద్యాలయాల్లో సీసాలు, కర్రలు, రాడ్లు, సుత్తులు, బ్యాట్లు, క్రికెట్ స్టిక్‌లతో దాడులు చేయడం, వాహనాలను పెట్రోల్ పోసి తగలపెట్టడం, దొరికిన వారిని దొరికినట్లు చావబాదడం శోచనీయం. ఇలాంటి విషసంస్కృతిని విశ్వవిద్యాలయాల్లోకి తీసుకురావడం దారుణం. రాజకీయ ప్రత్యర్థులు తమ ఎత్తులకుపై ఎత్తులు ఓటర్లను మెప్పించేందుకు, ప్రజలను నమ్మించేందుకు చేయాలే తప్పా, పెత్తనం కోసం, ఎదుటివారిపై చేయి సాధించేందుకు దాడులకు దిగడం సరైనది కాదు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం, పాత సినిమాల్లో లాగా అంత అయ్యిపోయాక చివర్లో రావడం, లాఠీలకు పని చెప్పడం విమర్శలకు తావిస్తోంది. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, నగరంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచి, ప్రజలకు భరోసా ఇచ్చి, భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహ కులు నీలకంఠ తెలిపారు. శనివారం మండలంలోని తగ్గువారిపల్లి గ్రామంలోని వీం బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మూల విరాట్యులకు ప్ర త్యేక పూజలు హోమాలు చేసి హరికథ కాలక్షేపం చేప ట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన చేపట్టారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న ఫలక్ నాస్ అనే విద్యార్థి ఏపీఆర్ఎస్ కమ్మనపల్లి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు విద్యార్థిని తండ్రి అప్సర్ బాషా తెలిపారు.

నాడు -నేడు పనులపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని విద్యాశా ఖధికారి కార్యాలయంలో నాడు నేడు పనులపై శని వారం సమీక్షా సమావేశం జరిగింది. నాడు-నేడు పనులు జరుగుతున్న ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో మండల విద్యాశా ఖధికారి ఎం.విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. డి.పి. మనోజ్ కుమార్, ఎఈ నాగభూషణం హాజరయ్యారు. నాడు-నేడు పనులను త్వరిత్తగతిన, క్వాలిటీగా వేగవంతం పనులు చేయాలని కోరారు.

గంగ జాతర చాటింపు

గంగజాతర చాటింపు సందర్భంగా హారతి

ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలో శుక్రవారం రాత్రి గంగ జాతర చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మకర్త జగదీశ్వర్ రెడ్డి కలిసానికి హారతి ఇచ్చి చాటింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 21న మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన.. అనంతరం బుధవారం సాయంత్రం మూడు గంటలకు అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపాకటాక్షాలు పొందాలని ధర్మకర్త కోరారు.

పులివర్తి నానిని పరామర్శించిన నాయకులు

పులివర్తి నానిని కలిసిన నేతలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: చంద్రగిరి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని వెంకటాపురం గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు శనివారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత వైసిపి నాయకులు రాష్ట్రంలోని టిడిపి నాయకులు కార్యకర్తలపై దాడికి పూనుకోవడం దుర్మార్గపు చర్య అని వాపోయారు. కార్యక్రమంలో జయరాజు, జయరామయ్య, ఏసు, బాబు, హరికృష్ణ, దావీదు, అశోక్, భూపతి, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

కొబ్బరి మొక్కలతో గ్రామస్తులు

ప్రజాశక్తి-పూతలపట్టు: మొక్కలు నాటండి.. వృక్షాలను కాపాడండి.. అవి మిమ్మల్ని కాపాడుతాయని సూచి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గ్లోరీ విజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా పూతలపట్టు మండలంలో వెంకటాపురం దళితవాడ ఎగువ పాలకూర, దిగువ పాలకూరు, కిచ్చన్నగారిపల్లి, మద్దులయ్యగారిపల్లి, అమ్మేపల్లి, ఆకనాబంటు, క్షీరసాగరం గ్రామాలలో శనివారం సంస్థ ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలకు రెండు కొబ్బరి చెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుచి స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేతి వృత్తి నైపుణ్యాలు విద్యాపరంగా వైద్య పరంగా త్రాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్మాణం వంటి సేవలందించామన్నారు. కార్యక్రమంలో సుచిసంస్థ కోఆర్డినేటర్లు ధనలక్ష్మి జాకబ్ వరదరాజులు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై చర్చించిన ఎస్ఐ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం కందూరు నెల్లిమంద తమ్మినాయునిపల్లి పంచాయతీలలో ఎస్ఐ వెంకట నరసింహులు శనివారం పర్యటించారు. గ్రామస్తుల ద్వారా స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు మండలంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులకు పలు సూచనలిస్తున్న ఎస్ఐ

స్థల వివాదానికి చెక్

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో సర్వే నంబర్ 212లలో 16సెంట్లు స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు కబ్జాకు యత్నించారు. శుక్రవారం జేసీబీతో చదును చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు తమకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలంలో ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారని ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో శనివారం ప్రజాశక్తిలో "శ్మశాన స్థలం కబ్జా" శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు అక్కడకు చేరుకొని స్థలాన్ని సర్వే చేసి శ్మశాన స్థలాన్ని తిరిగి గ్రామస్తులకు అప్పజెప్పారు. వివాదానికి శాశ్వత పరిష్కారం చూపారు. మరో సారి ఆక్రమణకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డిప్యూటీ తహశీల్దార్, వీఆర్‌వో, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలతో కంపు.. కంపు..

ప్రజాశక్తి-పెద్దపంజాణి: జాతీయ రహదారి పక్కనే వేస్తున్న చికెన్ వ్యర్థాలతో పాదచారులకు వాహనదారులకు ఇబ్బందిగా మారింది. మండల కేంద్రంలో దాదాపు 8 చికెన్ షాపులు ఉన్నాయి. వారు చికెన్ వ్యర్థాలను మండల అభివృద్ధి కార్యాలయ సమీపంలో జాతీయ రహదారి పక్కనే వేస్తుండడం వల్ల దుర్గంధం వెదజల్లుతూ వాహనదారులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు వానదారులకు ఇబ్బందులు లేకుండా వ్యర్థాలను తొలగించాలని పాదచారులు సమీప గ్రామస్తులు వాహనదారులు కోరుతున్నారు. అదేవిధంగా చికెన్ షాప్ నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డు ప్రక్కన వేయకుండా నిర్మూలించేందుకు అవగాహన కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారి సుబ్రహ్మణ్యం ప్రజాశక్తి వివరణ కోరగా వ్యర్థాలను రాత్రుల్లో వేస్తున్నారని, ఇదివరకే చికెన్ షాప్ నిరాహుకులకు ఈ విషయమై నోటీసులు ఇవ్వడం జరిగిందని, ఇప్పటివరకు వేసిన వ్యర్థాలను తొలగించి ఇకపై వ్యర్థాలు వేసిన చికెన్ షాప్ యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నయనానందకరంగా నగరవనం

కుప్పానిగుంట నర్సరీవద్ద నిర్మాణం చేస్తున్న నగరవనం ముఖద్వారం

- సందర్శకులను ఆకట్టుకునేలా సుందరీకరణ
- రూ.2 కోట్లతో ఆధునీకరిస్తున్న ఏఖోపార్కు
- శరవేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు

వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్న రోడ్డు

బోటుషికార్ నిర్మాణం చేపట్టనున్న కుప్పానిగుంట

ప్రజాశక్తి-కార్వేటినగరం: పుత్తూరు-కార్వేటినగరం మార్గ మద్యలో ఉన్న దాదాపు 50ఎకరాల్లో విస్తరించి ఉన్న కుప్పానిగుంట అటవీ ప్రాంతాన్ని పట్టణ ప్రజల సౌకర్యార్థం నూతన హంగులతో ఏఖో పార్కుగా నగర వనం రూపుదిద్దుకుంటోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో కొంత భాగాన్ని చిన్నారులకు స్విమింగ్ పూల్, బోట్ షికార్, స్కేటింగ్, పుత్తూరు, కార్వేటినగరం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సాయంత్రం వేళలో వాకింగ్ సేద తీరేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, ముఖ్య అతిధులు బస చేసేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన గెస్ట్ హౌస్ నిర్మాణం చేయడానికి పనులు వేగవంతం చేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం నారాయణస్వామితో పాటు, జిల్లా అటవీశాఖ అధికారి కూడా ఏఖో పార్కు నిర్మాణం చేస్తున్న కుప్పానిగుంట నర్సరీ ప్రాంతాన్ని సందర్శించి పార్కు ఏర్పాటుకు చేపట్టాల్సిన ప్రణాళికను పరిశీలించారు. నిత్యం వాహన చోదకులతో కిటకిటలాడుతున్న కార్వేటినగరం, పుత్తూరు రోడ్డుకు మద్యలో ప్రభుత్వం నగరవనం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందంటున్నారు. నగరవనం ఏర్పాటు వల్ల ఒత్తిళ్లకు లోనైన ఉద్యోగులు, సెలవు రోజుల్లో విద్యార్థులకు, విశ్రాంతి ఉద్యోగులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరే విధంగా నూతన హంగులతో సౌకర్యాలతో కూడిన నిర్మాణాలు జరుగుతున్నాయి. నగరవనం పార్కు అటు పుత్తూరు, ఇటు కార్వేటినగరానికి తలమానికంగా ఉంటూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిలో ఒక్కటిగా ప్రజలకు గుర్తిండిపోతుందని ఆ ప్రాంతానికి చెందిన వారు తమ అభిప్రయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అద్భుతంగా రూపుదిద్దుకుంటోంది

కుప్పానిగుంటలో ప్రభుత్వం నిర్మాణం చేపడుతున్న నగరవనం పార్కు అందరని ఆకట్టుకునేలా తయారవుతోంది. అద్భుతంగా రూపుదిద్దుకుంటున్న ఈ పార్కు కార్వేటినగరానికి తలమానికం కానుంది. చిన్నారులు మొదలు, అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునేలా తయారవుతోంది. కుప్పానిగుంట నర్సరీ ప్రాంతానికి ఇది వన్నెతేనుంది. కార్వేటినగర వనం నియోజకవర్గానికి ఏకైక అద్భుతమైన పార్కుగా నిలవనుంది. - మోహనకుమారి, కార్వేటినగరం

ఆకట్టుకునేలా ఉంది

నూతనంగా తయారవుతున్న కార్వేటినగర వనం ఆకట్టుకునే విధంగా సిద్ధమవుతోంది. ప్రత్యేక హంగులతో తయారవుతున్న నగరవనం పార్కు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా నిర్మాణం కానుంది. రూ.రెండు కోట్లతో దీనిని ఆధునీకరించి, త్వరలో అందుబాటులోకి రానుండడం ఆనందంగా ఉంది. - శివప్రకాష్ మొదలియార్, కార్వేటినగరం

23 నుంచి వేరుశనగ విత్తనకాయలు పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ఖరీఫ్ రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఈనెల 23వ తేదీ నుంచి చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గీత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీ పరిధిలో ఉన్న రైతులకు సంబంధించి మండలానికి 2015క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చాయన్నారు. రైతు భరోసా కేంద్రా పరిధిలో ఉన్నలి రైతులు వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు సోమవారం నుంచి వివరాలు నమోదు చేసుకోవాలని, వేరుశనగ విత్తనాలు వ్యవసాయం కొరకే వినియోగించుకుంటామని ధ్రువీకరణ పత్రం సమర్పించ వలసి ఉంటుందని తెలిపారు. 30కేజీల బస్తా విలువ మార్కెట్లో 2850రూ ప్రభుత్వ సబ్సిడీ40శాతం పోగా రూ.1710 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యవసాయ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పుంగనూరు వ్యవసాయ సంచాలకులు శివకుమార్ రాజు

సోమల: ఈనెల 23వ తేదీ నుండి రైతులకు వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఇందుకోసం రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ రాజు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో 8 మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు ఆర్‌బికె సిబ్బందికి డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2024కి సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయని 23వ తేదీ నుండి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు వ్యవసాయ అధికారులు ఇచ్చే షెడ్యూల్ ప్రకారం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

గాలివాన బీభత్సం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పాతపేట పంచాయితీ పరిధిలో ఉన్న కుప్పనపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలోనీ గోవిందప్ప కదిరిమ్మల ఇల్లు శుక్రవారం రాత్రి కురిసన గాలివాన బీభత్సానికి పెంకుటిల్లు దెబ్బతింది. మరమ్మతులకు లోనైనయి ఇల్లు కట్టుకోవాలంటే పేదరికం అడ్డు నాయకుల అధికారుల చుట్టూ పదేపదే తిరిగిన ఇల్లు రాలేదని, తాతల కాలం నాటి ఇల్లు వాన గాలి వస్తే ప్రాణం గుప్పెట్లో పెట్టుకుని బ్రతకాల్సి వస్తుందని ఆ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా వాసవి జయంతి

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని ఆనిగానూరు, రామకుప్పంలో వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయాలో శనివారం వాసవి జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం వారు అత్యంత ఘనంగా నిర్వహించారు. భక్తాదులు అడుగడుగున అమ్మవారికి మొక్కలు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో రామమూర్తి, ఎస్‌కే రవి, బద్రీనాథ్, దయా, చంద్రశేఖర్, సతీష్, ఎంజి నాగరాజు, మగి, నవీన్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సోమల: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు మండల కేంద్రమైన రామసముద్రం గ్రామంలోని అమ్మవారి ఆలయం నందు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు గ్రామంలో దీపాలను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని 50 కుటుంబాలకు చెందిన ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

గంగ జాతరకు పటిష్ట బందోబస్తు: డీఎస్పీ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులో తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా 21న గంగమ్మ శిరస్సు మెరవని, గంగమ్మ నిజరూప దర్శనం, 22వ తేదీ గంగమ్మ జలధి కార్యక్రమం జరుగనుంది. గంగమ్మ శిరస్సు కార్యక్రమానికి సంబంధించి పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్, సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వారు శనివారం గంగమ్మ శిరస్సు మెరువని రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ గంగ జాతర సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లు, 144సెక్షన్ అమలు గురించి వివరించారు. ఇంకా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందువలన జనాలు ఎక్కువగా గుంపులుగా చేరడానికి అవాంఛనీయ సంఘటనలు జరగడానికి వీల్లేదని, ఈ గంగ జాతర అనేది సాంప్రదాయబద్ధంగా జరిగే పండుగ కావున కొన్ని నియమ నిబంధనలతో ఈ దఫా పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనాలు ఎక్కువ సంఖ్యలో గుమి కోవడం కానీ డీజే పాటలు, బాణాసంచా పేలుళ్లు గాని జరపడానికి వీలు లేదని స్పష్టం చేశారు. నిబంధనలు అధిక్రమిస్తే నిర్దాక్షిణ్యంగా వారిపైన క్రిమినల్ చర్యలు, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహించేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

సింహ వాహనంపై ఊరేగిన కోనేటిరాయ స్వామి

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండలం కీలపట్లలో నెలకొనివన్న శ్రీ కోనేటిరాయి స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు సింహ వాహనంపై శ్రీ కోనేటి రాయ స్వామిని ఊరేగించారు. ఈ దేవాలయం రెండవ తిరుమల దేవస్థానంగా ఈ ప్రాంతం వారు భావిస్తారు. ఈ ప్రాంతం వారితో పాటు కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల భక్తులు కూడా ఈ దేవాలయానికి వచ్చి ముక్కులు తీర్చుకుంటారు. బ్రహ్మోత్సవం సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల వారు కాలినడకన దేవాలయం చేరుకుని భక్తిశ్రద్ధలతో మొక్కలు తీర్చుకుంటారు. తిరుమల కొండపై జరిగే విధంగా ఈ దేవాలయంలో కూడా ప్రతి ఒక్క కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.



భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పుంగనూరు: మద్యానికి బానిసై భార్య మందలించడంతో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పుంగనూరులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన బావాజాన్(38) మేస్త్రి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రతినిత్యం మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య మందలించింది. ఆమె శనివారం ఉదయం టమాటా పొలంలో కర్రలకు పుర్రి కట్టేందుకు వెళ్ళింది. బావాజన్ ఫుల్లుగా మద్యం సేవించి భార్య దగ్గరకు వెళ్ళాడు. ఇతని పరిస్థితిని గమనించి ఆమె చివాట్లు పెట్టింది. దీనిపై మనస్థాపానికి చెందిన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఈ సంఘటన గమనించి భావజాన్‌ను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారి మధుసూదనాచారి చికిత్సలు నిర్వహించారు. అతను ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిపారు.

టిప్పర్ బోల్తా యువకుడి మృతి

బోల్తా పడ్డ టిప్పర్

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: టిప్పర్ బోల్తా పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జయంతి గ్రామం వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. సిఐ లక్ష్మయ్య సమాచారం మేరకు.. చెన్నై-బెంగళూరు నూతనంగా నిర్మిస్తున్న కారిడార్ హైవే పనులు చేపడుతున్న దారుల్లో మట్టి నింపేందుకు ట్రిప్పర్ ద్వారా మట్టిని తరలిస్తున్న ఎగువ బంధార్లపల్లి చెందిన వెంకటేష్ కుమారుడు రాజేష్ (35) ట్రిపర్కు డ్రైవర్గా విధులు చేపడుతున్నాడు. మట్టిని అన్‌లోడ్ చేసే దిశలో అదుపుతప్పి హైడ్రాలిక్ డ్రైవర్ క్యాబిన్ ఒత్తిడి చేయడంతో డ్రైవర్ సీట్లను తగులుకొని మృతి చెందాడు. శవపరీక్ష నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజేష్ మృతదేహం

క్రైం కార్నర్

పూజారి కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సినీ ఫక్కీలో ఓ పూజారి కిడ్నాప్ కలకలం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో సుమారు 12మందిపై కేసు నమోదు అయినట్లు తెలిసింది. గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం గ్రామానికి సమీపంలో కొన్నాళ్ల క్రితం కొత్తగా అంకాళపరమేశ్వరి నిర్మించి ఆ గుడికి చైర్మన్ గాను, అదేవిధంగా ఎస్.ఆర్.పురం మండలం కొత్తపల్లి మిట్టవద్ద గల స్మార్ట్ డివి చైర్మన్‌గా కొనసాగుతున్న దీపక్ కుమార్ తాళ్ళకు, అగరమంగళం దళితవాడకు చెందిన పాత అంకాళపరమేశ్వరి గుడి పూజారి రామచంద్రన్‌కు తగాదాలు ఏర్పడి, ఆఖరికి రామచంద్రన్ కోర్టును సైతం ఆశ్రయించారు. అంకాల పరమేశ్వరి పాతగుడిలో పూజారిగా ఉన్న అగర మంగళం దళితవాడకు చెందిన రామచంద్రన్ కొత్త గుడి చైర్మన్ దీపక్ కుమార్ తాళ్ళకు తలనొప్పిగా మారారు. దీంతో తమిళనాడు పోలీసులంటూ సినీ ఫక్కీలో 20రోజుల క్రితం పూజారి రామచంద్రన్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్ళి చిత్రహింసలకు గురి చేసారని, వారి వద్ద నుంచి రామచంద్రన్ తప్పించుకుని బయటపడి పోలీసులను ఆశ్రయించారు. దీంతో నిందితులపై కిడ్నాప్ కేసు, హత్యాయత్నం కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు, వారిలో కిడ్నాప్ కేసులో సంబంధి ంచిన కొంత మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అయితే దీపక్ కుమార్ తాళ్ళతో పాటు మిగిలిన ముద్దాయిల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు.

బోరు మోటారు, స్టార్టర్ చోరీ

- సర్పంచ్, ఎంపీటీసీ, సెక్రెటరీ కలసి పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రక్షిత మంచినీటి సరఫరా స్కీం ద్వారా ఏర్పాటు చేసిన బోర్ మోటర్, స్టార్టర్ చోరీకి గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ముద్దికుప్పం గ్రామపంచాయతీ దిగువ ముద్దికుప్పం గ్రామంలో ప్రభుత్వ నిధులతో రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా గ్రామ ప్రజలకు త్రాగునీరు కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారు స్టార్టర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ క్రమంలో వరుసగా దోపిడీ జరుగుతున్నాయని గతంలో కూడా చొక్కామడుగు గ్రామంలో స్టాటర్ చోరీకి గురి అయినట్లు గ్రామస్తులు స్థానిక సర్పంచ్ గిరిబాబు, సీనయ్య ఎంపీటీసీ సిద్దయ్యతో కలిసి పంచాయతీ సెక్రెటరీ కోదండరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ స్టాటర్ సుమారు పదివేల ఐదు వందలు రూపాయలు విలువ చేస్తుందని అన్నారు. గ్రామస్తుతో కలిసి సెక్రటరీ కోదండరామిరెడ్డిలు ఎస్ఐ రాజాకుల్లయ్యప్పకు ఫిర్యాదు చేశారు. ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తానని తెలిపారు.

కర్నాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-రామకుప్పం: కర్నాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను రామకుప్పం ఎస్ఐ శివకుమార్, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. శనివారం మండలంలోని పచ్చారు మాకులపల్లి గ్రామానికి చెందిన అంజిరాజు, ప్రభు అనే ఇద్దరు కర్నాటక మద్యం తరలిస్తున్నారని.. ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 192 టెట్రా ప్యాకెట్లు, సుమారు 12 వేల రూపాయలు విలువచేసే మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పుంగనూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పుంగనూరు నంచి స్వగ్రామానికి వెళుతుండగా తిరిగి వెళుతుండగా ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు మండలంలోని నడిమి గడిదేసి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి(64), మునిరెడ్డి(65) స్వంత పనిపై వారు పుంగనూరుకు వచ్చి పెరిగే ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మదనపల్లి నుంచి పుంగనూరు వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం పూజగానిపల్లి మలుపు వద్ద శుక్రవారం రాత్రి రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో గ్రామానికి చెందిన ఇద్దరికీ తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. విరి ఇద్దరినీ వెంటనే ప్రాథమిక చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య అధికారి మధుసూదనాచారి వైద్య చికిత్స చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంగవరం: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి వెలుగుచూసింది. గండ్రాజు పల్లి పంచాయతీ, అనంతపురం గ్రామం పెద్ద గుర్రప్ప బుడ్డగాళ్ళు రాజన్న (58) రహదారిలో కాఫీ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో అలకుప్పం వైపు నుంచి కాఫీ బార్‌కు కాలి నడక నడిచి వస్తున్నారు. ఈ క్రమంలో అతి వేగంగా వస్తున్న క్వాలిస్ వాహనం అతన్ని ఢీకొట్టింది. దీంతో తీవ్ర రక్తగాయాలతో రాజన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిని కుమారుడు గురునాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చిన్నగోవిందు కేసు దర్యాప్తు చేస్తున్నారు.